ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శనివారం విశాఖలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి ఈత పోటీల్లో జిల్లాకు చెందిన పారా స్విమ్మర్స్ ప్రతిభ చాటారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన పారా స్విమ్మర్స్ మౌనిక సబ్ జూనియర్ విభాగంలో 50 మీటర్ల ఫ్రీ స్టైల్ పోటీల్లోనూ, ప్రియాంకదాస్ జూనియర్ విభాగంలో 50 మీటర్ ఫ్రీ స్టైల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఈనెల 12న ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని హైద్రాబాద్ లో జరుగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఉత్సవాలకు వేళాయె

- నేటి నుంచి రెండు రోజులపాటు విజయనగరం ఉత్సవాలు
- 6,7 తేదీల్లో పైడితల్లమ్మ పండగ
- 11 వేదికల్లో విజ్ఞాన, వినోద, సాహిత్య కార్యక్రమాలు

రాష్ట్ర సాంస్కృతిక కేంద్రంగా, విద్యల నగరంగా, కళలకు కాణాచిగా పేరొందిన విజయనగరం ఉత్సాహవాలకు వేళయ్యింది. మిరిమిట్లుగొలిపే విద్యుత్ కాంతులు... పచ్చటి తోరణాలు... రా రమ్మంటున్నట్టుగా స్వాగత ద్వారాలతో ముస్తాబైంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న విజయనగరం ఉత్సవాలు ఎప్పటి మాదిరిగానే ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. స్థానిక సంప్రదాయం ఉట్టి పడేలా, సంస్కృతి వెల్లివిరిసేలా, విజయనగరం వైభవాన్ని చాటి చెప్పేలా విజ్ఞాన, వినోద కార్యక్రమాలకు సన్నద్ధమైంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 5,6 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు, 6న పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను 11 వేదికల వద్ద నిర్వహించనున్నారు. విజయనగర ఉత్సవాలను గతం కంటే భిన్నంగా, వైవిద్యంగా నిర్వహించేందుకు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతి వేదిక వద్ద అధికారుల కమిటీతో పాటు శాశ్వత సభ్యులను ఇంచార్జ్‌లుగా నియమించారు. ఈ ఏడాది ఉత్సవాలను ప్రతి ఒక్కరి మదిలో మధుర స్మృతిని మిగిల్చాలని ఇప్పటికే మంత్రి వర్యులు అధికారులకు సూచించారు. అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించే ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలు, ప్రభుత్వ భవనాలు, పార్కులు, ప్రధాన కూడళ్ల వద్ద మిరిమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేశారు.. ఇప్పటికే చారిత్రక ప్రదేశాలైన గంటస్తంభం, కోట, మూడులాంతర్లు, ప్రభుత్వ సంగీత కళాశాల, గురజాడ స్వగృహాన్ని సుందరంగా అలంకరించారు.

గంటస్తంభం నుంచి ఉత్సవ ర్యాలీ

ఉత్సవ ప్రారంభ సూచికగా గంట స్తంభం నుంచి ఆదివారం ఉదయం 8గంటలకు ర్యాలీ ప్రారంభం కానుంది. పైడి తల్లమ్మ గుడి మీదుగా వివిధ కళారూపాలతో కోట వరకు ర్యాలీ సాగుతుంది. అనంతరం అక్కడ ప్రారంభ సభ నిర్వహిస్తారు. ఈ ర్యాలీలో వేలాది మంది కళాకారులు, సాహితీవేత్తలు, పురప్రముఖులు భాగస్వామ్యం కానున్నారు.

వేదికల్లో కార్యక్రమాలు

అయోధ్య మైదానం : ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పెంపుడు జంతువులు, పక్షులు ప్రదర్శన. సాయంత్రం 6గంటల నుంచి మ్యూజికల్ నైట్

మహారాజా కోట : ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు సైన్స్ ఫెయిర్, స్టాంప్స్ అండ్ కాయిన్స్, ఆర్ట్‌గ్యాలరీ, ఫోటోఎగ్జిబిషన్

గురజాడ కళాభారతి : ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు నాటకాలు, నాటికలు, స్థానిక కళాకారుల ఏక పాత్రాభినయాలు

విజ్జి స్టేడియం : వివిధ రకాల క్రీడా పోటీలు,

మహారాజా సంగీత నత్య కళాశాల : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత, నృత్య ప్రదర్శనలు

లేడీస్ రిక్రియేషన్ క్లబ్ : పుస్తక పరిచయం, భువన విజయం, సాహితీ గోష్టులు, అష్టావధానం.

లయన్స్ కమ్యూనిటీ హాల్ : ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు డాక్యుమెంటరీ ప్రదర్శన, జానపద నృత్యాలు, కర్ర సాము కత్తి సాము, పులి వేషాలు, డప్పు ప్రదర్శన, జముకల కథ, రేలారే రేలా, కోలాటం, తప్పెటగుళ్ళు బుర్రకథ, తూర్పు భాగవతం

బొంకుల దిబ్బ (కోటకు ఎదురుగా) : సాయంత్రం 6 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కన్యాశుల్కం, సీతా కళ్యాణం మోహిని భస్మాసుర, సత్య హరిచంద్ర నాటకాల ప్రదర్శనలు

మాన్సాస్ గ్రౌండ్ : ఫల, పుష్ప ప్రదర్శన, సరస్ (జాతీయ స్థాయి డ్వాక్రా ఉత్పత్తుల మేళా ఈనెల 8వరకు ఉంటుంది)

కోట వెనుక భాగం : సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పైడిమాంబ చరిత్ర, లేజర్‌షో (విజయనగర వైభవం)

మ్యూజికల్ నైట్‌కు రానున్న గీతామాధురి, రాహుల్ సిప్లిగంజ్, మధు ప్రియ

అయోధ్యా మైదానం లో మెగా ఈవెంట్‌ను 5, 6 తేదీల్లో రెండు రోజులు నిర్వహిస్తారు. 5న సాయంత్రం 6 గంటల నుండి ప్రముఖ సినీ గాయకులు మధుప్రియ, సౌజన్య, జానకిరావ్ బృందం, ప్రముఖ డాన్సర్ పూజా నాగేశ్వర్ అండ్ శేఖర్ మాస్టర్ వారి డాన్స్‌లతో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తారు. 6న ప్రముఖ సినీ గాయకులు రాహుల్ సిప్లిగంజ్, నోయల్ సేన్, గీతా మాధురిల లైవ్ మ్యూజిక్ షోతో మెగా మ్యూజికల్ నైట్ జరుగనుంది.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

పైడితల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

కంటోన్మెంట్ : విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి పండగ నేపథ్యంలో ఏర్పాట్లును శనివారం రాత్రి కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్ పరిశీలించారు. ఆలయం వద్ద క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లు, క్యూలైన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేయనున్న రెవెన్యూ, పోలీసు శాఖల తాత్కాలిక కంట్రోల్ రూములను పరిశీలించారు. ఆలయం పరిసర ప్రాంతాలను, దర్శనాలకు భక్తులు వచ్చి, దర్శనం అనంతరం ఆలయం బయటకు వెళ్ళే మార్గాలను పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అమ్మవారి దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పి చాలని ఆదేశించారు. వారి వెంట జాయింట్ కలెక్టరు సేతు మాధవ్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆర్‌డిఒ దాట్ల కీర్తి, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, దేవాదాయశాఖ ఎసి శిరీష, మున్సిపల్, ఆర్అండ్‌బి అధికారులు, పలువురు సిఐలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేశాం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత ● 15,479 మందికి 23.21 కోట్లు జమ

ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత, ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశామని జిల్లా ఇంచార్జ్ మంత్రి వి.అనిత పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం శనివారం స్థానిక మెసానిక్ టెంపుల్‌లో జరిగింది. కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు మెగా చెక్కును పంపిణీ చేసారు. జిల్లాలో 15,479 మంది లబ్దిదారుల ఖాతాలలో 23 కోట్ల 21 లక్షల 85 వేల రూపాయలను నేరుగా జమ చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం దిశగా మరో అడుగు వేసిందని అన్నారు. స్త్రీ శక్తి వలన ఆటో డ్రైవర్లు కొంత ఆదాయాన్ని కోల్పోతున్నామని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగానే వారికి ఆర్ధిక సహాయం కింద సంవత్సరానికి 15 వేల రూపాయలను ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఇప్పటికే తల్లికి వందనం పథకాన్ని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు సాయం అందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న విధంగా ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం చేపట్టారని తెలిపారు. అంతకుముందు మంత్రి జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ నుండి ఆటోను కొంచం దూరం నడిపి, అదే ఆటో లో వేదిక వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.అదితి గజపతి రాజు, కాపు కార్పొరేషన్ యశస్వి , బిజెపి జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ , డిప్యూటీ కమిషనర్ అఫ్ ట్రాన్స్‌పోర్ట్ మణి కుమార్ ఎంవిఐ లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం ఉత్సవాలను, పైడితల్లి అమ్మవారి పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ప్రతి సాధారణ భక్తునికి చక్కటి దర్శనం లభించేలా ఏర్పాట్లను చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తో కలిసి ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ పోలీస్ శాఖ, రెవిన్యూ , దేవస్థానం వారు కలిసి కంట్రోల్ రూమ్ నుండి అను నిత్యం పర్యవేక్షించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీటి సరఫరా ప్లాస్టిక్ రహితంగా సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున 170 బస్సులు వరకు అవసరం అవుతాయని, ఆయా రూట్ల లో బస్సు లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పి. అదితి గజపతి రాజు మాట్లాడుతూ విఐపి దర్శనాలకు ఇబ్బంది కలగకుండా ప్రోటోకాల్ అధికారులు జాగ్రత్తగా చూడాలన్నారు. రథాలన్నీ తనిఖీలు చేసుకొని, వాలంటీర్లకు, సేవా ప్రతినిధులకు ఐ.డి. కార్డులను జారీ చేయాలనీ తెలిపారు. కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి మంగళవారం ఉదయం పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కళాకారులతో చేపట్టే ప్రారంభ ర్యాలీకి 4 వేల మంది హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎస్‌పి ఎఆర్ దామోదర్ , అదనపు ఎస్‌పి సౌమ్య లత, కాపు కార్పొరేషన్ ఛైర్పర్సన్ యశస్వి, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టాలను అంచనా వేస్తున్నాం

మంత్రి కొండపల్లి

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రెండు రోజులుగా భారీ వర్షాల వల్ల జరిగిన పంట నష్టాలను అధికారులు అంచనా వేస్తున్నారని, నష్టపోయిన వారందరికీ పరిహారం చెల్లిస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత రెండు రోజులుగా జిల్లాలో ఈదురు గాలులు, అకాల వర్షాల వల్ల విద్యుత్ శాఖకు చెందిన విద్యుత్ లైనులకు పలు ప్రాంతాలలో నష్టం జరిగిందని తెలిపారు. పంట నష్టంపై గణాంకాలను అధికారులు సేకరిస్తున్నారని చెప్పారు. దత్తి గ్రామంలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి సిఎం హామీ ఇచ్చారని ఎన్నో ఏళ్లుగా సారవగెడ్డ మినీ రిజర్వాయర్ అపరిష్కృతంగా ఉందని, దానికి ముఖ్యమంత్రి పర్యటన ద్వారా పరిష్కారం లభించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఎంతో చిన్న ప్రాజెక్టు అయినప్పటికీ ఆ ప్రాంతంలో చాలా కీలకమైందని,ఎక్కువ ఉపయోగంగా ఉంటుందని అన్నారు. తారకరామ తీర్ధ సాగర్, తోటపల్లి రిజర్వాయర్ కుడికాలువ తదితర ప్రాజెక్టులకు త్రికరణ శుద్ధితో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. విజయనగరం జిల్లాలో భారీ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని మంత్రి శ్రీనివాస్ చెప్పారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ ఏడాది పైడితల్లి అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ ద్వారా పండుగకు రూ. 50 లక్షలు, యూత్ ఫెస్టివల్ ద్వారా మరో రూ. 50 లక్షలు, సరస్ ఎగ్జిబిషన్ కోసం రూ. కోటి ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

నష్టం అంచనాలు వెంటనే వేయాలి : కలెక్టర్

కంటోన్మెంట్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాలను, రహదారులు, విద్యుత్ తదితర నష్టాలను అంచనా వేసి వెంటనే పంపాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఎటువంటి వివాదాలకు తావు లేని, ఖచ్చితమైన , పారదర్శకమైన అంచనాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలను పంపాలని సూచించారు. శనివారం ఉదయం కలెక్టర్ యూరియా సరఫరా, భారీ వర్షాలు, జి.ఎస్.టి కాంపెయిన్ తదితర అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టిపై ఏ రోజు షెడ్యూల్ ఆ రోజు పాటించాలని సూచించారు. జెసి సేధు మాధవన్, అధికారులు పాల్గొన్నారు.

6న గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 6న కలెక్టరేట్లో నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

డ్వాక్రా బజారు వద్ద కళాకారుల నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అఖిల భారత్ డ్వాక్రా బజారు వద్ద శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అష్టలక్ష్మీ కళా నృత్య రూపకం, భగవతీ నృత్య కళామందిర్ విద్యార్థుల ప్రదర్శన శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు నృత్య రూపకం చూపరుల అభినందనలు అందుకుంది. డిఆర్‌డిఎ సిబ్బంది ఆలపించిన అలనాటి అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. చిన్నారి క్రిషిక సీతారామ చరితం నృత్య రూపకం, అభినయ డాన్స్ అకాడమీ చిన్నారులు భారత నాట్యం, లక్ష్మీనరసింహ నృత్య కళా రూపకం అందరి మన్ననలూ పొందాయి.

నవోదయంతో సారా నిర్మూలన

ప్రజాశక్తి-రామభద్రపురం

జిల్లాలో నాటుసారా నిర్మూలనకు నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.ఎస్.దొర తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం ప్రాంతాల్లో గతంలో నాటుసారా అమ్మకాలు ఎక్కువగా ఉండేవని తెలిపారు. గత నెలలో జిల్లాలో రూ.109 కోట్ల మద్యం అమ్మకాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.106 కోట్లు అమ్మకాలు జరిగాయన్నారు. జిల్లాలో నాటుసారాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో 12 మద్యం కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.33 వేల విలువైన 260 సీసాలను ఎస్ఐ ప్రసాదరావు సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలను సందర్శించిన విసి

ప్రజాశక్తి - గరివిడి

గరివిడి పశువైద్య కళాశాలను శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జె.వి.రమణ శనివారం సందర్శించారు. క్లినికల్ కాన్ఫరెన్స్‌లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ఆవరణలో బాస్కెట్‌బాల్ మైదానాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం సాధించవచ్చని తెలిపారు. అనంతరం అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కెన శ్రీను అధ్యక్షతన కళాశాల ఆవరణలో శాస్త్రీయ పరిశోధన కేంద్రం, పరిరక్షణ ప్రదేశం, బోటానికల్ గార్డెన్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ మైదానాన్ని ప్రారంభిస్తున్న శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జె.వి.రమణ

రాజకీయ వివాదాలకు తెరలేపడం సరికాదు

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పండగ సమయాల్లో రాజకీయాలకు తెరలేపడం, పరిపక్వత లేకుండా మాట్లాడడం మంచి సంప్రదాయం కాదని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యలయంలో తన ఛాంబర్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంప్రదాయానికి అనుగుణంగా అందరూ కలిసి జరుపుకునే పండగకు లక్షలాదిమంది రానున్నందున ప్రభుత్వం తగిన ఏర్పాటుల చేయాలని కోరుతున్నామన్నారు. డిసిసిబి ఆవరణలో కూర్చుని సినిమానోత్సవాన్ని తాము ఎన్నో ఏళ్లుగా తిలకిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా అక్కడ కూర్చునేందుకు ఏర్పాటు చేయాలంటూ అధికార యంత్రాంగానికి బొత్స సత్యనారాయణ లేఖ రాశారని తెలిపారు. ఈ విషయాన్ని డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అదేదో నేరమైనట్టుగా, తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా మీరు ఇక్కడ కూర్చుని సిరిమానోత్సవాన్ని తిలకించడం ఏమిటి? అంటూ పరిపక్వత లేకుండా మాట్లాడారని అన్నారు. బొత్స సత్య నారాయణ శాసన మండలి విపక్ష నేత అనే విషయాన్ని, ఆయన క్యాబినెట్ హోదాలో ఉన్నారన్న విషయాన్ని డిసిసిబి ఛైర్మన్ గమనించాల న్నారు . ప్రోటోకాల్ ప్రకారం ఈ వేడుకకు వచ్చే ప్రజా ప్రతినిధులకైనా తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. బాధ్యత గల పదవుల్లో ఉన్నవారు మాట్లాడేటప్పుడు సంయమనాన్ని పాటించాల న్నారు శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ కోరిన మేరకు ..ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తుందని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. తుపాను కారణంగా జిల్లాలో అరటి మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టం అంచనాలు వేసి పరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, ఎంపిపి ప్రతినిధి పీరు బండి జైహింద్ కుమార్ పాల్గొన్నారు

బోధనకే పరిమితం చేయాలి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

నెల్లిమర్లలోని రామతీర్థం కూడలిలో నిరసన చేపడుతున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రామభద్రపురం

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించి, బోధనకు పరిమితం చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సి వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు, ఐఆర్, డిఎలను ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెమో నెంబర్ 57ను అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఈ నెల ఏడో తేదిన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు వి.ప్రసన్నకుమార్, జెసి రాజు, కేశవరావు, రవికుమార్, శంకరరావు, సుధాకర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : బొబ్బిలి ఎంఆర్‌సి వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ నెల ఏడో తేదిన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు విజయగౌరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామారావు, వెంకట్ నాయుడు, పోలి నాయుడు, శివకుమార్, మహేష్, మోజెస్, కృష్ణదాసు పాల్గొన్నారు.

జామి : జెడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఎఆర్‌కె ఈశ్వరరావు ఆధ్వర్యాన తొలుత ఉపాధ్యాయులంతా నిరసన తెలిపారు.

నెల్లిమర్ల : ఉపాధ్యాయుల సమస్యలపై రామతీర్థం జంక్షన్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు వి.రమణ, పతివాడ త్రినాథ్, మద్దిల సత్యనారాయణ, ఉండ్రు శ్రీనివాసరావు, కొండపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

వంగరలో బైక్ ర్యాలీ చేపడుతున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట : చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యాన స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి.వి.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగర : ఫ్యాప్టో ఆధ్వర్యాన వంగరలో బైక్ ర్యాలీ చేపట్టారు. సీనియర్ నాయకులు కంబోతుల రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హామీని నిలబెట్టుకుని, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో విజయ వాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎల్.రామకృష్ణ, బి.శ్రీనివాసరావు, వై.భాస్కర రావు, పి.మురళి, బి.ఉమా మహేశ్వరరావు, ఎం.వి.రమణ, పి.గౌరీశంకర్ రావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

జిఎస్‌టిపై ప్రచారం ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తగ్గించిన జిఎస్‌టిపై ప్రజల్లో అవగహన కలిగించేందుకు అధికార యంత్రాంగం విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎమ్మెల్యేలు, అధికార పార్టీలకు చెందిన నాయకులూ ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. దీనిపై మేథావి వర్గంలోనూ, క్రయ, విక్రయాలపై కాస్త అవగాహన ఉన్నవారు, ఆర్థిక నిపుణులు, వినియోగదారుల తరపున పనిచేసే సంఘాల నాయకుల నుంచి భిన్నమైన స్పందన వినిపిస్తోంది. 'ఇంతటి ముమ్మర ప్రచారం ఎవరి కోసం. నిజంగా ప్రజల ప్రయోజనాల కోసమేనా? ఈ ఆలోచన గనుక ప్రభుత్వానికి, పాలక పార్టీలకు ఉంటే, దీని అమలుపై వర్తకులు, వాణిజ్య సంస్థలతో సమావేశాలు నిర్వహించేవి. క్రయ, విక్రయాలపై దృష్టిపెట్టి అమలు చేయని వారిపై చర్యలు తీసుకునేవి. అలా కాకుండా ధరలు తగ్గాయంటూ జనంలోకి వెళ్లడం వల్ల వారికి అదనంగా ఒనగూరేదేముంది.' అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కాదేదీ కవితకు అనర్హం అన్నట్టుగా కాదేదీ రాజకీయాలకు అనర్హం అంటూ జిఎస్‌టి రూపంలో ప్రజలపై మోపిన భారంలో అవగింజంత తగ్గించి, తాటికాయంత రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జిఎస్‌టి తగ్గింపుపై పండగలా ప్రచారం చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. కాదు కాదు... ఈ విధమైన ఒత్తిడి ప్రభుత్వం చేస్తోంది. ఇందుకోసం విజయనగరం జిల్లాలో ఏకంగా నాలుగు వారాల షెడ్యూల్‌నే ప్రకటించారు. ఈ కార్యక్రమానికి గత నెల 22న శ్రీకారం చుట్టిన సంగతి విధితమే. గత నెల 25 నుంచి 29వరకు ఇంటింటికి వెళ్లి ధరల తగ్గాయంటూ చెప్పారు. 30వ తేదీ నుంచి వ్యవసాయం, ఇతర వృత్తిదారుల దగ్గరకు వెళ్తున్నారు. ఈ తరహా ప్రచారం ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతుందట. 7వ తేదీ నుంచి 13 వరకు విద్యారంగం, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో ప్రచారం చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. 14నుంచి 18వ తేదీ వరకు సేవారంగంలో ముఖ్యంగా టూరిజం, రెన్యుబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్స్ తదితరాలు, 19న గొప్ప ముగింపు కార్యక్రమం చేపడతారట. కానీ, నిజంగా జిఎస్‌టి భారం తగ్గిందా? వేసిన పన్నును తగించినందుకు ప్రచారం ఎందుకు? జిఎస్‌టి భారం దేశం పుట్టికతో వచ్చింది కాదు కదా? ఒక దేశం... ఒకే పన్ను అంటూ బిజెపి అధికారంలోకి వచ్చాక మోపిన భారమే ఇది. అప్పట్లో మన జిల్లాలోనూ వ్యాపారులు, వినియోగదారులు, వాణిజ్య సంస్థలు కూడా పెద్దపెట్టున వ్యతిరేకించారు. జిల్లా కేంద్రం ధర్నాలు, నిరసన కార్యక్రమాలతో దద్దరిల్లిన సందర్భాలు, సన్నివేశాలు ఇంకా కళ్లముందు కదిలాడుతునే ఉన్నాయి. ఈ సంగతి అటుంచితే.... ధరలు పెరిగినప్పుడైమైనా పాలకులు, అధికారులు విచారం వ్యక్తం చేశారా? . దేశం, రాష్ట్రం, జిల్లా ఇంత క్లిష్టపరిస్థితుల్లో ఉంది



కాబట్టి ధరలు పెంచుతున్నాం... పెంచక తప్పడం లేదు. అంటూ ఊరూర ప్రచారం చేస్తున్నారా? మరి ధరలు పెంచినప్పుడు, పెరిగినప్పుడు లేని హడావుడి, తగ్గించినప్పుడు ఎందుకు? కూటమి ప్రభుత్వంలో పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ధరలు రోజు రోజుకూ మారుతున్నాయి. వంటనూనె, ఇతర నిత్యవసర సరుకుల ధరలు కూడా అంతే. దీన్నిబట్టి స్వల్పంగా తగ్గించిన జిఎస్‌టి వల్ల పేదలకు ఏదో ఒరిగిపోయినట్టు భ్రమలు కల్పించేందుకు పాలకపార్టీలు ఆడుతున్న నాటకం ఇది అని సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. విమర్శలే కాదు... 'బతుకే భారంగావున్న మెజార్టీ ప్రజానీకం ఇటువంటి ప్రచారాన్ని ఎలా స్వీకరిస్తారు. ఎలా జీర్ణించుకుంటారు అనేది పబ్లిక్ టాక్.

దీక్షలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఆ భూములను ఎంఎస్ఎంఇలకు ఇవ్వొద్దు

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం సేకరించిన భూములను ఎంఎస్ఎంఇలకు ఇవ్వొద్దని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్‌చేశారు. జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూములను తిరిగి తమకు ఇవ్వాలని కోరుతూ బొడ్డవరలో నిర్వాసితులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ కట్టి, అందరికీ ఉద్యోగాలు ఇచ్చి, షేర్ రూపంలో కంపెనీలో వాటా కల్పించి, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చినే అప్పుడు నిర్వాసితులు భూములిచ్చారని గుర్తుచేశారు. అప్పటివరకు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తే భూములను జిందాల్ యాజమాన్యానికి ప్రభుత్వం ద్వారా అప్పగించారని వెల్లడించారు. ఆ భూములను తిరిగి ఎంఎస్ఎంఇ పేరుతో అమ్ముకొనే పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇటీవల కొంతమంది నాయకులు జిందాల్ భూముల్లోనే ఎంఎస్ఎంఇలు కట్టాలని అడగడంలో అర్థం లేదన్నారు. ఎంఎస్ఎంఇ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటే, ముందు నిర్వాసితుల భూములను వారికి తిరిగి అప్పగించి, కొత్తగా భూసేకరణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. కొత్తగా నిర్వాసితుల నుంచి సేకరించిన భూముల్లో ఫైవ్ స్టార్ కాదు, సెవెన్ స్టార్ హోటల్ కట్టుకున్నా అభ్యంతరం లేదన్నారు. దీక్షల్లో నిర్వాసితులు పాల్గొన్నారు.

విఒఎలపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

విఒఎలపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో పని చేసిన వెలుగు ఉద్యోగులు అక్రమాలు చేశారని చెప్పారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న కొన్ని గ్రూపుల డబ్బులు తిరిగి కట్టకపోతే, సక్రమంగా కడుతున్న గ్రూపుల సొమ్మును వాటికి జమ చేయడం సరికాదన్నారు. గతంలో జరిగిన అక్రమాలను విఒఎలకు అంటగట్టి, రాజకీయ వేధింపులు పాల్పడి, అక్రమంగా తొలగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. వెలుగు అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, యుగంధర్ పాల్గొన్నారు.

ఇ-పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని డెంకాడ గ్రామంలో ఇ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ ఎడి ఎ.నాగభూషణరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇ-పంట నమోదు ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని విఎఎలకు సూచించారు. మండలంలో వరి పంట 5213 ఎకరాల్లో సాగవుతోందన్నారు. ఇప్పటివరకు 3717 ఎకరాలను నమోదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి.సంగీత, ఎఇఒ బి.రామకోటి, విఎఎ అపర్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగర ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతరలో అంకితభావంతో పని చేయాలని ప్రజారోగ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగ రోజుల్లో 3 షిఫ్ట్ లు వారీగా సిబ్బందిని నియమించనున్నామన్నారు. ఎక్కడా ఎటువంటి చెత్తాచెదారాలు లేకుండా అనునిత్యం పారిశుధ్యం పైనే దృష్టి సారించాలన్నారు. సిరిమానోత్సవం అయిపోయిన తర్వాత కూడా రహదారులన్నీ పరిశుభ్రంగా ఉండేటట్టు చూడాలన్నారు. 12 ప్రాంతాలలో 60 బయో టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది సెలవులు మంజూరు చేసే అవకాశం లేదన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, వెల్ఫేర్, హెల్త్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పి.చిట్టిబాబు కోరారు. శనివారం ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే ఎస్‌సి ఎస్‌టి అత్యాచారాలు ఎక్కువగా జరిగే జిల్లాగా ఉందని, కావున నివారణ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరారు. అత్యాచార బాధితులు ఫిర్యాదు చేసినా ఆలస్యం లేకుండా తక్షణమే కేసు నమోదు చేయాలని అన్నారు. అత్యాచారాలు జరిగే గ్రామాలను గుర్తించి ఆ ప్రాంతంలో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్‌పి పి.సౌమ్యలత, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు బసవ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కోటాలో ట్రిపుల్ ఐటికి ఎంపిక

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆరికతోట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఆడపా భువనేశ్వరి క్రీడా కోటాలో ఒంగోలులోని ట్రిపుల్ ఐటి సీటు సాధించిందని పీడీ బొత్స రత్నకుమారి తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన మలిరెడ్డి జ్యోతిప్రకాశ్ క్రీడల్లో మంచి ప్రావీణ్యత పొందుతూ క్రీడా కోటాలో నాగార్జునసాగర్‌లోని ఎపిఆర్‌జెసిలో ఇంటర్లో సీటు సాధించడం గమనార్హం. వీరిని పాఠశాల హెచ్‌ఎం గులిపల్లి కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

చినరామునాయుడుకు రాష్ట్ర స్థాయి పదవి

ప్రజాశక్తి-వేపాడ

వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా వేపాడ మండలానికి చెందిన, డిసిసిబి మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు నియమితులయ్యారు. దీంతో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు, వైసిపి మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. మండలంలో పార్టీ అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేస్తారని వెంకటరావు అభిప్రాయ పడ్డారు.

పైడితల్లమ్మకు హోటల్స్ అసోసియేషన్ సారె

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పైడితల్లి అమ్మవారికి విజయనగరం హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సారె సమర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పివిఎస్ వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపి హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని ఎ మారుతీ వద్దనుంచి అసోసియేషన్ సభ్యులు సతీ సమేతంగా అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలు, పసుపు, కుంకుమ, పళ్ళు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సునీల్ కుమార్, ట్రెజరర్ జి.కృష్ణ చైతన్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా ఆటో డ్రైవర్ల సేవలో..

ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని జిల్లాలో పలుచోట్ల ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ప్రారంభించారు. ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు నమూనా చెక్కులు అందజేశారు. ఆటోలో ఎమ్మెల్యేలు ప్రయాణిస్తూ, నడుపుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొనడంతో పండగ వాతావరణం నెలకొంది.

బొబ్బిలిలో నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

గుర్ల.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

డెంకాడలో నమూనా చెక్కు అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల.. ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, ఆటోడ్రైవర్లు

గ్రామకంతాలకు పొజిషన్ ఎవరు ఇస్తారు?

సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపిపిల ప్రశ్న

రెవెన్యూ సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ శశిభూషణరావు

ప్రజాశక్తి-రేగిడి

గ్రామకంతాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం పొజిషన్ ధ్రువపత్రాలు ఎవరిస్తారని వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు.. హౌసింగ్ ఎఇ జి.ప్రసాద్‌ను ప్రశ్నించారు. రేగిడి మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పొజిషన్ ధ్రువపత్రాలు జారీ చేస్తే సంబంధిత అధికారులపై కోర్టుకు వెళ్తామని వారు హెచ్చరించారు. ఎంపిడిఒ, తహశీల్దార్ చర్చించి, ఏ శాఖ వారు ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తారో తేల్చాలని డిమాండ్‌చేశారు. మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట వద్ద రాజాం - పాలకొండ ప్రధాన రహదారి గుంతలమయమైందని, మంజూరైన సిసి రోడ్లు తక్షణమే వేయాలని మజ్జిరాముడు పేట సర్పంచ్ కరణం నిర్మల కోరారు. గత రెండు సమావేశాల్లో ఈ రోడ్డు దుస్థితిపై ప్రశ్నించినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారంటూ ఆర్అండ్‌బి ఇన్‌ఛార్జి ఎఇ సతీష్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎఇ సతీష్ స్పందిస్తూ ప్రధాన రహదారికి రూ.8 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, రూ.4 కోట్లు బిల్లులు బకాయి ఉండటంతో సిసి రోడ్డు పనులు జరగలేదన్నారు. దీనిపై వైస్ ఎంపిపిలు స్పందిస్తూ వచ్చే సర్వసభ్య సమావేశంలోగా ఈ రెండు గ్రామాల వద్ద సిసి రోడ్లు నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు తీర్మానించి పంపించాలని ఎంపిడిఒ శ్యామల కుమారికి సూచించారు. తహశీల్దారు గైర్హాజరు కావడంతో బూరాడ సర్పంచ్ వావిలపల్లి శశి భూషణరావు అసంతృప్తి వ్యక్తంచేశారు. రెవెన్యూ సమస్యలు ఎక్కడి గొంగళి అక్కడే చందంగా తయారయ్యాయని మండిపడ్డారు.

కొర్లవలస, పనసలవలస గ్రామాల్లో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయని సర్పంచ్ బంకి చంద్రశేఖర్.. ఆ శాఖ ఎఇ సురేష్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎపిఎం బాసిన గోవిందరావు, ఎంఇఒ వర ప్రసాదరావు, ఎపిఒ హరినాథ్, వైద్యాధికారులు అసిరినాయుడు, రీనాచౌదరి పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన నాగావళి

ప్రజాశక్తి-సంతకవిటి

భారీ వర్షాల కారణంగా ఉగ్రరూపం దాల్చిన నాగావళి నది ఉధృతి శనివారం తగ్గుముఖం పట్టింది. వరదనీరు తగ్గడంతో సంతకవిటి మండలంలోని కె.ఆర్ పురం, రంగరాయపురం, పి.జే పేట, తమరాం, పోడలి, చిత్తారిపురం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నది ప్రవాహం తగ్గడంతో అధికార యంత్రాంగం పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. నాగావళి నది వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో శుక్రవారం రాత్రి కె.ఆర్ పురం గ్రామం సిమెంట్ గట్టుకు తాకింది. దీంతో అవసరమైతే ప్రజలను పునరవాసానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లును మండల అధికారులు చేశారు. శనివారం ఉదయానికి నాగావళి నది ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులంతా నిమగ్నమయ్యారు. ప్రధానంగా అరటి, మొక్కజొన్న, చెరకు, కాయగూరల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పాఠశాల మైదానంలో చేరిన వర్షపునీరు

పాఠశాల మైదానం జలమయం

ఇటీవల కురిసిన వర్షాలతో సంతకవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం జలమయమైంది. మైదానం చెరువును తలపించడంతో విద్యార్థులు సాధారణ కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. పాఠశాల ఆవరణలోని సైకిల్ స్టాండ్‌లో సైకిళ్లు పెట్టలేకపోయారు. చిన్న చినుకు పడితే చాలు పాఠశాల మైదానం చెరువులా తయారవుతుంది. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్‌డి రవీంద్ర

ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఇళ్ల సర్వే శత శాతం పూర్తి చేయాలని మున్సిపల్ ఆర్‌డి రవీంద్ర సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. పన్ను లేని ఇళ్లకు పన్నులు వేయాలన్నారు. పన్నుల్లో తేడా ఉన్న ఇళ్లను గుర్తించి సరిచేయాలని సూచించారు. సర్వేకు 16 బృందాలను నియమించారు. సమావేశంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి పాల్గొన్నారు.

బాలసదన్ తనిఖీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో మహారాణిపేటలో ఉన్న బాల సదన్ చిన్న పిల్లల వసతి గృహాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. డైనింగ్ హాలు, వంటి గది, మరుగుదొడ్లు పరిశీలించారు. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని హితవు పలికారు. సందర్శన సమయంలో 8 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి బాలికల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న బియ్యం, పప్పు దినుసులను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు పురుగు పట్టకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అంతా నాయకులే.. డ్రైవర్లు ఎక్కడ?

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆటో డ్రైవర్ల కం సేవలో పథకాన్ని ప్రభుత్వం శనివారం ఆర్భాటంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శృంగవరపుకోట పట్టణంలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని 2735 మంది ఆటోడ్రైవర్లకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి రూ.4.10 కోట్ల చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డ్రైవర్ల కన్నా.. వేదికపై కూటమి నాయకుల సంఖ్య ఎక్కువగా కనిపించింది. హాల్ అంతా ఖాళీ కుర్చీలే కనిపించాయి. ఇదిచూసి కంగుతిన్న పెద్దలు వెంటనే వెనుకవైపు ఉన్న కుర్చీలను తీసేయాలని కార్యకర్తలను ఆదేశించారు. దీంతో పైన ఉన్న వారంతా కిందికి చేరారు. అయినా సభలో సగానికి పైగా కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. నియోజకవర్గ స్థాయి కార్యక్రమానికి జనసమీకరణ సరిగా లేదంటూ అక్కడున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అసంతృప్తి వ్యక్తంచేశారు. తహశీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌డిసి మురళి, ఎంపిపి సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

తొలుత నాయకులతో నిండిపోయిన వేదిక

నాయకులను కిందికి దించినా ఆటో డ్రైవర్లు లేక ఖాళీ కుర్చీలు ఇలా..

ఫెర్రో పరిశ్రమపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - గరివిడి

మండలంలోని కుమరాం పంచాయతీ పరిధిలో శోభ మెటల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ స్థాపనపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సర్వే నంబర్లు 136/1, 136/5, 136/5ఎలో రూ.15 కోట్ల అంచనా వ్యయం ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తంచేశారు. కాలుష్యం, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సూచనలు, అభిప్రాయాలను సంబంధిత శాఖలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాస్‌మూర్తి, తహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, పిసిబి జాయింట్ చీఫ్ ఇంజినీర్ రామారావు నాయుడు, ఎస్ఐ లోకేశ్వరరావు, కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి బృందం పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఒ

నాగార్జునా.. దిగజారుడు రాజకీయాలొద్దు

వైసిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఉన్నత కుటుంబంలో పుట్టి, ఉన్నత చదువులు చదువుకొన్న డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున లాంటి వ్యక్తి దిగజారుడు రాజకీయాలు చేయొద్దని వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీ హితవుపలికారు. శనివారం చీపురుపల్లిలోని వైసిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను విమర్శించే స్థాయి నాగార్జునకు లేదన్నారు. డిసిసిబి మీ జాగీరా..? అంటూ బొత్స సత్యనారాయణను ఉద్దేశించి నాగార్జున చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. కనీస పరిజ్ఞానం లేకుండా నాగార్జున చౌకబారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద మార్కులు కొట్టేయడానికి ఇటువంటి పనికిమాలిన రాజకీయాలు చేయకూడదని హితవుపలికారు. గత ఎన్నికల్లో కిమిడి నాగార్జున ఎమ్మెల్యే టికెట్ ఆశించినా ఎందుకు రాలేదో ఆలోచించాలని సూచించారు. కనీసం నాగార్జున పినతండ్రి, స్థానిక ఎమ్మెల్యే కళావెంకటరావు.. ఆయన్ను ఎందుకు పట్టించుకోవడం లేదో గుర్తెరగాలన్నారు. డిసిసిబి భవనంపైనుంచి దర్శనం కోసం చేసిన సిఫార్సు లేఖను అడ్డంగా పెట్టుకుని చీపురుపల్లి మండలంలో వెలుగు, ఉపాధి హామీ, తదితర శాఖలలో ఉద్యోగులను అక్రమంగా తొలగించారంటూ నాగార్జున చేసిన ఆరోపణలు వాస్తవం కాదని ఖండించారు. సమావేశంలో వైసిపి నాయకులు పతివాడ రాజారావు, గరిడి రామదాసు, గబిడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న పైడితల్లమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు

పైడితల్లమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. దేవస్థానం అధికారులు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ హోదాలో గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి. అశోక్ గజపతి రాజు, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలక మండలి సభ్యులు ఆలయ అభివృద్ధిలో, పండగను విజయవంతంగా చేయడంలో కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస. యశస్వి , బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ, దేవస్థానం సహాయ కమీషనర్ శిరీష , ఉద్యోగులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతి రైతు భూమిని రీసర్వే చేయించుకుని, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నందాం, గొడియాడ గ్రామాల్లో రీసర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేకు రైతులు సహకారం అందించాలన్నారు. ఎవరికి, ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటరావు చౌదరి, డిప్యూటీ తహశీల్దార్ హరి కిరణ్, మండల సర్వేయర్ భవాని పాల్గొన్నారు.

సంతకవిటి : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మూడో విడత రీ సర్వే నిర్వహిస్తుందని తహశీల్దార్ బి.సుదర్శన్ రావు అన్నారు. శనివారం మండలంలోని గుళ్లసీతారాంపురం, అప్పల అగ్రహారం గ్రామాల్లో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోవిందరావు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తిరాజేరు : ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమారి కోరారు. మండలంలోని దాసుపేట, భోజరాజపురం, ఎస్.చింతలవలస, బలభద్రరాజపురం గ్రామాల్లో రైతులకు గ్రామసభ ద్వారా అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. గ్రామాలకు అధికారులు రీ సర్వేకు వచ్చేటప్పుడు రైతులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో శంకరరావు, బంగారు నాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గంట్యాడ, దత్తిరాజేరు.. ర్యాలీ చేపడుతున్న రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సిబ్బంది

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చ

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని పాతబగ్గాంలో సర్పంచ్ లెంక పద్మావతి అధ్యక్షతన శనివారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికల తయారీపై విస్తృతంగా చర్చించారు. త్వరలో జరిగే గ్రామసభలో ప్రణాళికలను ప్రవేశపెట్టాలని సచివాలయ సిబ్బందిని సర్పంచ్ ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా నిరంతరం కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను అభినందించారు. వచ్చే ఏడాది ఉపాధి హామీ పనులకు సంబంధించి అంచనా వ్యయం, పనులపై చర్చించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డి అప్పారావు, టిడిపి సీనియర్ నాయకులు లెంక చిన్నంనాయుడు, సంగం రెడ్డి సన్యాసిరావు, అంగన్వాడీలు కనకదుర్గ, శారద, ఎఎన్ఎం ఉమ, ఆశావర్కర్లు పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సచివాలయ కార్యదర్శి అప్పారావు

అంబేద్కర్ విగ్రహంపై దాడి అమానుషం

ప్రజాశక్తి-శృంగవరపు కోట

భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులతో కలిసి శనివారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దవళంపేటలో అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై దేశ ద్రోహం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత నాయకులు గుర్రపు శ్రీనివాసరావు, తెరపల్లి కోటారావు, బోనెల ఈశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని జైభీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులు, మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అల్లూరి జిల్లా చింతపల్లిలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసిన ఘటనలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శనివారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి వై.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పౌష్టికాహారం భాగం కావాలని గంట్యాడ ఐసిడిఎస్ పిఒ డి.ఉమాభారతి తెలిపారు. మండలంలోని అంబటివలస గ్రామంలో శనివారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్.పైడిరాజు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, డిజిటలీకరణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు వాడటం వల్ల తక్కువ ఖర్చుతో పోషకాహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తాళ్లపూడి అప్పలనాయుడు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-సంతకవిటి

ప్రపంచ నేత్ర, దృష్టి దినోత్సవం సందర్భంగా బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం రాజాం ఏరియా ఆస్పత్రి కంటి వైద్యులు వసంతరావు నేత్ర పరీక్షలు చేశారు. తొమ్మిది మంది విద్యార్థులకు కళ్లద్దాలను సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం సత్యనారాయణ, జూనియర్ రెడ్‌క్రాస్ ఉపాధ్యాయులు అదపాక దామోదర రావు పాల్గొన్నారు.

సర్వేపల్లి విగ్రహావిష్కరణ

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.వెంకటరావు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.శైలజారాణి, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని కెంగువ గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి శనివారం మాజీ సర్పంచ్ లెంక శ్రీలక్ష్మి శంకుస్థాపన చేశారు. తన సోదరుడు, పోలీసు అధికారి కెంగువ అప్పలనాయుడు సహకారంతో బస్‌షెల్టర్ నిర్మిస్తున్నట్లు శ్రీలక్ష్మి తెలిపారు. తమ తల్లి దండ్రులు కెంగువ కన్నం నాయుడు, చిన్న అప్పలమ్మ జ్ఞాపకార్థం రూ.1.20 లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి లెంక గణేష్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కి శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన పంచ గొంతుల తులసి (40) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు వివరాలు ప్రకారం.. తులసి బుడతనాపల్లి నుండి ద్విచక్ర వాహనంపై కొటారుబిల్లి జంక్షన్‌కు వెళ్తుండగా, గొడియాడ గ్రామ రహదారి సమీపంలో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తులసి మృతి చెందాడు. గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తులసి చేపల వేటాడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు ప్రతిరోజు భార్య లక్ష్మితో కలసి పిట్టలను ఇతర ఇతర జంతువులను వేటాడుతూ అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.